క్లుప్తంగా

మూడురోజుల ఉచిత శిక్షణ

శాయంపేట : స్టూడెంట్స్ టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (స్టెప్) ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుంచి 6 వరకు మూడురోజుల పాటు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు వరంగల్ విభాగం స్టెప్ సమన్వయకర్త కందగట్ల గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ప్రవర్తనా లోపాలను సరిచేసి వారికి ఆత్మవిశ్వాసం కల్పించనున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలం నెక్కళ్లు గ్రామంలో ఉన్న ధ్యాన మందిరంలో 3 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉచిత వసతి, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం మెటీరియల్, సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. 3 రోజులకు సరిపడే దుస్తులు, బెడ్షీట్స్, వెంట తెచ్చుకోవాలని, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా రావచ్చని తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులు, విద్యార్థులు 9392213311 మొబైల్ నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాలీ దగ్ధం

శాయంపేట : షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ట్రాలీ వాహనం దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని పరకాల– హనుమకొండ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల నుంచి హనుమకొండకు వెళ్తున్న అశోక్‌లేలాండ్ ట్రాలీ వాహనం క్యాబిన్‌లో ఉన్నపలంగా షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకుని మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ సతీష్ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలిపాడు. వాహనంలోని హమాలి ప్రశాంత్ డయల్ 100కు కాల్ చేయడంతో ఎస్సై ప్రమోద్‌కుమార్ పరకాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

బీఆర్‌ఎస్ గ్రామకమిటీ ఎన్నిక



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌లో మంగళవారం బీఆర్ ఎస్ గ్రామకమిటీని ఎన్నుకున్నట్లు మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా దాసి శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్ర రాజు, ఉపాధ్యక్షులుగా బొత్స మహేందర్, బైరి రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాజేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శిగా కల్వల సతీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు బైరి శ్రీనివాస్, అరికిల్ల ప్రసాద్, మేకల శ్రీనివాస్, మారెపల్లి నందం, కొమ్ముల శివ, కరణ్‌బాబు, మోహన్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్ : మండలంలోని గూడూరులో శ్రీ అంజన్న ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూడిద రానేష్, ప్రధాన కార్యదర్శిగా వల్లెపు సురేందర్, గౌరవ అధ్యక్షుడిగా కుమ్మరి కృష్ణబాబు, ఉపాధ్యక్షుడిగా ఆవునూరి రాకేష్, కోశాధికారిగా ఆవునూరి చంద్రమౌలి, సహాయ కార్యదర్శిగా లోకిని దశరథం, సలహాదారులుగా తెప్ప రాజు, కుమ్మరి శ్రీకాంత్, పాక రాజు, వంగ అశోక్, బండి శ్రీను (పల్సర్) తదితరులు ఎన్నికయ్యారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

నడికూడ : పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రం–2 టీచర్ సంపూర్ణ అన్నారు. గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ పిల్లల ఎత్తు, బరువును పరిశీలించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ.. కొలమానం ద్వారా పిల్లల ఎదుగుదల గురించి తెలుసుకుని పోషణ లోపాన్ని గుర్తించి తొలగించాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం విలువల గురించి, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు

ఆర్థికసాయం అందజేత

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన మునిగాల సాయికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా కడియం పరపతి సంఘం సభ్యులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. అదే విధంగా మృతుడు కడియం పరపతి సంఘంలో సభ్యత్వం పొంది ఉండడంతో అతడు తీసుకున్న చిట్టీ డబ్బులు రూ.20 వేలు మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. అతడు పొదుపు చేసిన రూ.2,400 బాధిత కుటుంబానికి చెల్లించినట్లు తెలిపారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

- ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంబురాలు
- ఆడిపాడిన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు
- మార్మోగిన పాఠశాల ప్రాంగణాలు



ఆత్మకూరు : అక్కంపేట ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం, పెద్దకోడెపాక గ్రామాల్లోని సన్‌రైస్, శ్రీవేద పాఠశాలలో మంగళవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగ బతుకమ్మ పర్వదినం నిలుస్తుందని పాఠశాలల కరస్పాండెంట్లు పెంట తిరుపతి, విజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, విద్యారాణి, సోని, రచన, వేద, ప్రియాంక, కీర్తిరెడ్డి, సల్మా, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : ప్రకృతిని ఆరాధించే విశిష్ట సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగా అని ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ నేపథ్యం, చారిత్రక అంశాలను విద్యార్థులకు తెలిపారు. పండుగలో ఉన్న శాస్త్రీయ కోణాన్ని వివరించారు. బతుకమ్మను పేర్చే క్రమంలో పసుపు, గూనుగు, తంగేడు, గుమ్మడి, మందార, బంతి తదితర రకాల ఔషధ



శాయంపేట : ప్రగతిసింగారంలో ..

గుణాలు కలిగిన పూలు వినియోగిస్తారని అన్నారు. ఈ బతుకమ్మను చెరువులో వదలడంతో జలవనరులు శుద్ధిచేయబడుతాయని చెప్పారు. పండుగలో తొమ్మిది రోజులు చేసే బెల్లం, నువ్వులు, పల్లి, చింత తదితర ప్రసాదాల వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అందుకే ప్రపంచంలో ఎక్కడా లేని ప్రాధాన్యత బతుకమ్మ పండుగకు ఉంటుందని



ఐనవోలులో..

విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఉపాధ్యాయునిలు బతుకమ్మ, కోలాటాలు ఆడారు.

ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి

శాయంపేట : పద్మబ్రాహ్మణులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మలిపెద్ది కృష్ణశాస్త్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీశివ మార్కండేయ, శ్రీవేంకటేశ్వర ఆలయాల్లో మంగళవారం జిల్లా ఉపాధ్యక్షుడు మార్త రాజ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా ప్రథమ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పద్మబ్రాహ్మణులు పురోహితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎంతో మంది నిరుపేదలు ఈ వృత్తిలో కొనసాగుతున్నారని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు, పింఛన్ మంజూరు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు జారీ చేసి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. అనంతరం మార్కండేయ వ్రతాన్ని నిర్వహించారు. జిల్లా పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు.



కృష్ణశాస్త్రిని సన్మానిస్తున్న పద్మబ్రాహ్మణులు

వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఓంకార్ శాస్త్రి, తెలంగాణ రాష్ట్ర వేద పాఠశాల అధ్యక్షుడు క్యాతం రాజ్‌కుమార్ శాస్త్రి, ఫిలిం డైరెక్టర్ కర్ణాటక కుక్కి దేవాలయ కమిటీ సభ్యులు తొటం శ్రీనివాస్, రిటైర్డ్ ఎంపీడీఓ గొల్లపల్లి విద్యాసాగర్, మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ భిక్షపతి, పద్మబ్రాహ్మణులు యాదగిరి, కర్ణాకర్, శివసాయి, రామకృష్ణ, రాచర్ల రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

వేలేరు : మండల కేంద్రానికి చెందిన బొమ్మరబోయిన బాణయ్య సెల్‌ఫోన్ కొన్ని రోజులకిత్రం పడిపోయింది. దీంతో వేలేరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోగొట్టుకున్న ఫోన్‌ను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాణయ్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానంలో పాల్గొనాలి

ఐనవోలు : గాంధీ జయంతిని పురస్కరించుకుని టీపీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరానికి యువకులు, రక్తదాతలు భారీగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

ఆత్మకూరు : నేటి నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ వారిగా 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఎంఈఓకు సన్మానం

శాయంపేట : ఎంఈఓ భిక్షపతిని పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎస్ఐ కరస్పాండెంట్ రెవరెండ్ సామ్‌జార్జ్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, రాజన్న కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సీఆర్పీ శ్రీను ఉన్నారు.

సైకిళ్ల పంపిణీకి ఎన్ఆర్ఐల సాయం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న లక్ష్మి, లింగారావు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న తొమ్మిది మంది విద్యార్థినులకు ఉప్పల్‌కు చెందిన ఎర్రబెల్లి లక్ష్మి–లింగారావు దంపతుల కుమారులు ఎర్రబెల్లి విఠల్‌రావు, విజయ్ మన్‌మోహన్‌రావు (అమెరికాలో స్థిరపడ్డ ఎన్ఆర్ఐ) మంగళవారం సైకిళ్ల పంపిణీని సాయం అందించగా వారి తల్లిదండ్రులు విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఉప్పులపల్లి నుంచి ఉప్పల్‌లోని పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో రూ.51 వేల విలువచేసే సైకిళ్లు అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఎంఈఓ రాంకిషన్‌రాజు, హెచ్‌ఎం వాణి, ఏఏపీసీ చైర్‌పర్సన్ బండారి రాధ, మాజీ ప్రజాప్రతినిధులు సంపత్‌రావు, శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు ఉమాదేవి, రేవతి, సంపత్‌కుమార్, నయీంపాషా, రామకృష్ణయ్య, షర్మిల, రాజేందర్, శ్రీధరాచారి, కొమురయ్య, ఇందిరారాణి, కిరణ్, పాపయ్య, కోమల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాంగ్రెస్ పార్టీ చిన్నచూపు

వేలేరు : రైతులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి మారబోయిన రాజు విమర్శించారు. పీచరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల్లో సాధ్యంకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఎకరానికి రూ.15వేలు రైతు భరోసా ఏమైందని, వానాకాలం సీజన్ గడిచినా సాయం అందలేదని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతుబంధు ఇచ్చి అన్నదాతలను ఆదుకున్నామని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్



మాట్లాడుతున్న రాజు

ప్రభుత్వం నెరవేర్చాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. నాయకులు సిద్దులు, మల్లారెడ్డి, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

ముగిసిన బొడ్డెమ్మ వేడుకలు



శాయంపేట : బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



దామెర : బొడ్డెమ్మ నిమజ్జనానికి వెళ్తున్న చిన్నారులు, మహిళలు

దామెర : మండలంలోని వివిధ గ్రామాల్లో బొడ్డెమ్మ నిమజ్జనాన్ని మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరెవాడతో పాటు బజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొడ్డెమ్మను సంప్రదాయరీతిన సమీపంలోని గిద్దె చెరువులో నిమజ్జనం చేశారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలో బొడ్డెమ్మను మంగళవారం నిమజ్జనం చేశారు. పుట్టమట్టితో తయారు చేసిన బొడ్డెమ్మను తొమ్మిది రోజులపాటు చిన్నారులు, మహిళలు ప్రతిరోజు నైవేద్యం సమర్పించి, పుష్పాలతో అలంకరించి బతుకమ్మ ఆడిపాడారు. చివరి రోజు మంగళవారం బొడ్డెమ్మకు నైవేద్యం సమర్పించి కోలాటాల నడుమ, డప్పుచప్పుళ్లతో స్థానిక చెరువులలో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఐనవోలు: మండలంలోని పంథిని శివారులో గల పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పంథిని శివారు చెన్నారం గ్రామానికి వెళ్లే దారిలో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు మాత్రమే పట్టుబడగా.. మరో 7 మంది అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.17,830 నగదు, ఒక సెల్‌ఫోన్, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పారిపోయిన 7గురు వ్యక్తులతో పాటు పట్టుబడిన ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టొద్దు

- తహసీల్దార్ సత్యనారాయణ



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు చేపట్టి సక్రమంగా లబ్ధిదారులకే అందించాలని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతీ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ప్రతీ డీలర్ ఉదయం, సాయంత్రం షాపు తెరిచి లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఈ నెలలో సద్దుల బతుకమ్మ, దసరా పండగలు ఉన్నందున డీలర్లు ఎక్కడికి వెళ్లినా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనుమతి తీసుకుని వెళ్లాలని అన్నారు. కార్డుదారుల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయవద్దని, రేషన్ షాపుల తనిఖీల్లో వెలుగు చూస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, ఎమ్మార్ఐ శరత్‌కుమార్, ఏఆర్ఐ రమేశ్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సామల మల్లయ్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

- రాస్తారోకో చేసిన శ్రేణులు



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఐనవోలు : మండల కేంద్రంలోని కేజీబీవీలో జరిగిన ఓ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేసిన వ్యాఖ్యలకు బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాగరాజు హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా దేవాలయాలపై మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. సనాతన ధర్మం దేశ సాంప్రదాయమని, దేవాలయాలు మానసిక స్థితిగతులకి, ఆచార వ్యవహారాలకు సంబంధించిందన్నారు. బడి విజ్ఞానాన్ని నేర్పుతుంది, గుడి నాగరికత జ్ఞానాన్ని నేర్పుతుందని అన్నారు. సమాజంలో గుడి, బడి రెండు ఉండాల్సిందేనని, అది తేసుకోకుండా ఎమ్మెల్యే మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మండల అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి, జిల్లా, మండల నాయకులు మహేశ్వర్‌గౌడ్, తిరుపతి, రాజు, రాజు, వెంకటనారాయణ, కుమారస్వామి, ప్రభాకర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలి



బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : రానున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, సీఐ రంజిత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని తాళ్లకుంట చెరువు సమీపంలో సద్దుల బతుకమ్మ ఆడేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంగణంలో చెత్తా చెదారం లేకుండా డోజర్‌తో చదును చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు సమీపానికి చిన్నపిల్లలు వెళ్లకుండా బారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, ఎమ్మార్ఐ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు కట్టయ్య, రంగుబాబు గ్రామస్తులు ఉన్నారు.

అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్మసాగర్ శివారులోని దేవునూర్ రోడ్డు నల్లకట్ట (పైప్‌లైన్) సమీపంలో మొత్తం 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు కొంతభాగం కబ్జా చేసి అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపారు. మరికొందరు మిగతా భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్ సదానందంకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్పందించిన తహసీల్దార్ భూమిని



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

పరిశీలించారని, త్వరలోనే సర్వేయర్‌తో సర్వే చేయించనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శాంతిసాగర్, ప్రశాంత్, చిన్నవెంకటయ్య, సురేష్, భిక్షపతి, సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణిచంద్ర



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్ కుమార్

ధర్మసాగర్ : తాగునీటి సమస్య తలెత్తకుండా మంచినీటి సహాయకులు దృష్టిసారించాలని మిషన్ భగీరథ డీఈఈ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని పనిచేస్తున్న మంచినీటి సహాయకులకు మంగళవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో శిక్షణ కల్పించారు. సింగిల్ ఫేస్, త్రీఫేస్ మోటార్లు, ప్యానెల్ బోర్డుల గురించి వివరించారు. అదే విధంగా ఈ శిక్షణ నాలుగు రోజులు ఉంటుందని, వాటర్ క్వాలిటీ, చేతిపంపుల నిర్వహణ, ప్లంబింగ్, పైప్‌లైన్ లీకేజీ, నల్లా కలెక్షన్ల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ రవీందర్, ఏఈఈ ఇంట్రా చంద్రు నాయక్, ఏఈఈ గ్రిడ్‌సుధ, ధర్మసాగర్, వేలేరు ఎంపీడీఓలు అనిల్ కుమార్, లక్ష్మీప్రసన్న, ఎంపీఓలు సయ్యద్ అబ్జల్, విమల, పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న పంపు ఆపరేటర్లకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర తెలిపారు. మిషన్ భగీరథ నుంచి సరఫరా అయ్యే నీటిని ట్యాంకుల నుంచి పంపు ఆపరేటర్లు గ్రామాలకు విడుదల చేయాలని సూచించారు. సింగిల్‌ఫేస్, త్రిఫేస్ మోటార్లు, ప్యానెల్ బోర్డుల గురించి మిషన్ భగీరథ డీఈఈ మధుకుమార్, ఇంట్రా ఏఈఈ వెంకటేష్, గ్రిడ్ ఏఈఈ వహీద్ వివరించారు. నాలుగురోజుల పాటు మిషన్ భగీరథ పథకం అమలు తీరుపై శిక్షణ ఉంటుందని తెలిపారు. రెండోరోజు నీటి నాణ్యత గురించి, మూడోరోజు చేతిపంపుల నిర్వహణ, నాలుగోరోజు ప్లంబింగ్, పైపులైను లీకేజీ, నల్లా కనెక్షన్ గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామమంచినీటి సహాయకులకు శిక్షణ కల్పించినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. ట్రైనర్ ప్రవీణ్‌కుమార్ పలు అంశాలపై సూచలు, సలహాలు ఇచ్చారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, గ్రిడ్ ఏఈ రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు



వి.మౌనిక



టి.మనోజ్‌కుమార్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం నిర్మలాకుమారి తెలిపారు. వి.మౌనిక, టి.మనోజ్‌కుమార్ 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17 బాలబాలికల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబర్చి పాఠశాల పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. మౌనిక, మనోజ్‌కుమార్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం నిర్మలాకుమారి, పీఈటీ గ్రేసమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.